ముసలమ్మకు కొంచెం దూరంలో ముసలమ్మ మనుమడు, అతని భార్య ఏదో చెప్పుకొని నవ్వుతున్నారు....

"ఏ వూరు బోతున్నవే ముసలవ్వ....?"

ముసలమ్మ కళ్లు తెరచి వీరయ్యను చూసింది. రవికలోనుండి నశ్యం డబ్బాతీసి నశ్యం ఎగబీల్చింది. దాని ముక్కుకు నశ్యం రెండు వేపులా అంటి ఉన్నది...

"నా మనుమడు తీసుకపోతండు బిడ్డా! ఆడు దచ్చన్న రాజ్జెన కొలువు జేత్తండు. కాలం మంచిగ రాలే కొడుకా! మనుషులు కన్నతల్లిని ఉన్న ఊరు నిడిసి కాలేర్ల మీనికి ఎగబడిపోతండ్లు"... ముసలవ్వ దవడలు తాకులాడుతుండగా, చెవులకు నూలు దారంతో కట్టుకున్న సెవుకాయలు ఊగుతుండగా చాలా చెప్పింది...

"నేను తాలుకాకు బోతన్న, పుట్టి బుద్దెరిగినకాన్నుంచి..." ముసలవ్వ ఊ కొడుతుండగా మళ్లీ మొత్తం కతంతా చెప్పుకొచ్చాడు వీరయ్య. ముసలవ్వ మధ్య మధ్య కళ్లొత్తుకుంటూ, తిడుతూ విన్నది....

"కట్టం పుటుకే కొడుకా నీది... ఆళ్లకేం బొయ్యే కాలం? దునియ పురాగ సెడిపోయింది బిడ్డ. బట్టగాల్సి మీనేసే కాలం... ఆడుతనినెత్తి బుడతడు గొడితె బుడతని నెత్తి బోడోడు గొట్టిండట... ఆళ్లకు దగ్గ మిండెలు తయారయ్యిండ్లన్న మాట... ఇగో ముసల్ది గిట్ల జెప్పిందని ఎనుక దిట్టినా మంచిదే... ఊరంత ఒక్కటయినప్పుడు మనం గండ్ల కలువాలె- అచ్చేటిది గురుతు జేసుకొని తప్పించుకోవాలె- మనకు బురదడ్డమత్తె ఏం జేత్తం? తొక్కుడు బండేసుక దాటిపోతం..." ముసలవ్వ ఇలాగా చాలాచాలా చెప్పింది.

వీరయ్య ఈసారి హెూటల్ గుడిశె సాయెబు దగ్గరికి నడిచాడు. నోరు తెరచి ఏదో చెప్పబోయాడు....

"ముందుగాల గీ చాయ్ తాగు..." సాయెబు.

"నాదగ్గెర...."

"ఊకెనే పోసిన, తాగు....."

వీరయ్య నమ్మలేనట్టుగా చూశాడు....

"మీది పోతారం గాదు...."

ఔనన్నట్లుగా తలూపాడు వీరయ్య.

"నాకంతెరికె- ముందుగాల చాయ్ తాగు..."

"అంబలి దాగెటోన్ని గాదు...."

"చచ్చేంబోవు... గట్టోనివే తాగు...."

తల రుమాలు ఊడబీక్కొని గ్లాసును పట్టుకొని ఊదుకుంటూ తాగాడు... పైసలియ్యబోతె సాయెబు తీసుకోలేదు.

